పెద్దల మనసు

వవివేటి నాగచంద్రావతి

(కిక్కిరిసిన జనంలోనించి ఊపిరి సలపకుండా చేసిన ప్రయాణం ముగిసింది. బస్సు దిగి గుండెల నిండుగా హాయిగా గాలి పీల్చుకున్నది విశాల. అన్నగారు రఘు బస్సు మీదనించి కూలీ అందించే సూట్కేసు రెండు చేతులతోనూ అందుకుంటూ 'నిమ్మదిగా — నిమ్మదిగా' అంటున్నాడు.

తల సరిచేసుకుని, బొట్టు చెరక్కుండా కొంగుతో మొహాన్ని అద్దుకున్నది జాగ్రత్తగా.

దగ్గర కొచ్చిన రిక్షావాడితో బేరమాడుతున్నాడు రఘు, 'రాజాగారి బంగళాకు ఎంతిమ్మంటావోయ్?'

'అరవై పైసలిప్పించండి బాబూ' సూట్కేసు లాక్కున్నంత పని చేస్తున్నాడు వాడు

'ఎందుకయ్యా నలభై పైసలు.' మొహం చిట్లించి సూట్కేసు వెనక్కి గుంజుకున్నాడు రఘు.

'నేను బాబూ సానాదూరం పోవాల. అద్దరూపా యిప్పియ్యండి' ప్రబతిమలాడాడు రిక్షా అతను.

జవాబు చెప్పకుండా మరో రిక్షాకోసం కలయ చూశాడు రఘు.

'పోనీ లేరా అన్నయ్యా ఎక్కుదాం' అన్నగారి సమాధానానికి ఎదురు చూడకుండానే రిక్షా ఎక్కి కూచున్నది విశాల. చెల్లెలి తొందరకు విసుక్కుంటూ తప్పని సరిగా తనూ ఎక్కేశాడు.

ఇంకో సమయంలో అయితే విశాల కూడా గీసి గీసి బేరాలాడ్డంలో అన్నగారిని మించిపొయ్యేదే గాని, ఎప్పుడు ఇంటికి వెళ్లి వాలుదామా అన్న తహ తహలో ఏ కాస్త సమయాన్నీ వ్యర్థం కావడం భరించలేకపోయింది.

ఈ బస్సు ఒకటి. పెధకది క్షణ క్షణం ఆగటం, గొర్రెల్ని తోలినట్టు బయటి జనాన్ని లోపలికి తోలడం. గవర్నమెంటు బస్సులొచ్చాక తొక్కిడి తగ్గిందనుకోవటమేగాని తనకేమీ కనిపించలా. 'నా కాలు తొక్కేస్తున్నారం'టూ ఒకరు గోల పెడుతుంటే, 'అలా కుమ్మేస్తావేమిటయ్యా?' అని మరొకరి కంప్లెయింటు. 'జరగండమ్మా—జరగండి. అలా విశాలంగా కూర్చుంటే ఎలాగ? సద్దుకోండి—సద్దుకోండి' మధ్య మధ్య కండక్టరు అదిలింపు. 'నయం...విశాలంట విశాలం... ఒకరిమీద ఒకర్ని ఎక్కిస్తూ. ఇదేమన్నా పుష్పకమా ఎంతమందిని ఎక్కినా మరొకరికి రిజర్వేషను సీటుండటానికి? అయిదు గంటల ప్రయాణం ముగిసేసరికి అర్ధ యుగం గడిచినట్టయింది తనకి.

రిక్షా సందు గొందులన్నీ దాటి సిమెంటు రోడ్డు ఎక్కింది.

రాజాగారి బంగళా ఊరికి కాస్త దూరంగా వుంటుంది. తను వుద్యోగం చేసే తాలూకా ఆఫీసు అక్కడకు దగ్గర కావడం, వూళ్లోని అద్దెల్ని భరించలేకా, రాజాగారి బంగళా వెనక 'ఔట్ హౌస్' అద్దెకు తీసుకున్నాడు రఘు.

వూరికి దూరమైనా కరెంటూ, పంపులాంటి సౌకర్యాలన్నీ ఇక్కడా వున్నాయి.

టౌన్లో లభించనిదీ అలజడి లేనిదీ అయిన ప్రశాంత వాతావరణం, చల్లటి గాలి, ప్రాణానికి తెరిపిగా వుంటాయి.

ఇక పోతే ఇక్కడ లేనిదీ, టౌన్లో వున్నదీ ఏవిటంటే మురికీ, దోమలూ, దుకాణాలూ, సినిమాలూ మొదలైనవి. మొదటి రెండూ అక్కర్లేకపోయినా మూడూ నాలుగూ సౌకర్యాలకోసం అప్పుడప్పుడూ వీలుచేసుకుని వెళ్లక తప్పదు.

రిక్షా బంగళా గేటుముందు ఆగింది. హుషారుగా రిక్షాలోంచి దూకినట్టే దిగింది విశాల. ఒకచేత్తో సూట్కేసు పుచ్చుకుని, మరో చేత్తో జేబులో డబ్బులుతీసి లెక్కపెట్టి, రిక్షావాడి చేతిలో పెట్టాడు రఘు.

'ఇంకో ఐదు పైసలిప్పించండి బాబయ్యా! ఎదరగాలి' ప్రాధేయపడ్డాడు రిక్షావాడు.

'చాలు—చాలు. ఇప్పటికే వో పదిపైసలెక్కువ.' చెల్లెలివంక గుర్రుగా చూశాడు రఘు

కోటగోడల్లాంటి ఎత్తైన ప్రహరీ. రెండేనుగు లొక్కసారిగా వెళ్లగల పెద్ద ఇనపగేటు. రాజాగారి పూర్వపు వైభవాన్ని చెప్పక చెబుతున్నాయి. గేటుకు రెండు వైపులా స్తంభాలమీదవున్న రాతి సింహాలు కోరలు చూపుతూ కూచున్నాయి.

'పదా—' అన్నగారు తనని దాటుకుని వెడుతూ హెచ్చరించాడు. ఉత్సాహంగా కదిలింది విశాల.

రాజాగారు ఇక్కడ వుండరు కాబట్టి పెద్దగేటు సాధారణంగా తియ్యరు. అది రాజాగారి పిల్లలు వేసవికాలం శలవలు గడిపేందుకు వచ్చినప్పుడో, మరే ఇతర శుభకార్యాలు జరుపుకోటానికి విచ్చేసినప్పుడో పూర్తిగా తెరుస్తారు. మళ్లీ అది వారి నిష్క్రమణతోపాటే మూసుకుపోతుంది. తతిమ్మా రోజుల్లో లోపలి ఉన్నవాళ్లకి గేటు మధ్యలో అమర్చివున్న చిన్నగేటే శరణ్యం. చిన్నగేటైనా మరీ ఒంగి నడిచేటపాటేంత బుల్లిదేం కాదు. రిక్షా లోపలికి వెళ్లడానికి ఇనపకమ్మీ అడ్డమొస్తుంది కాని సైకిలైతే సునాయాసంగా ఎత్తి లోనికి పోవచ్చు — బైటికి రావచ్చు.

గేటు దాటింతరవాత రాజాగారి మేడదాకా దాదాపు అరఫర్లాంగు దూరమున్న దారి అంతా సిమెంటుతో చప్టా చేసి వుంది. మేడముందు కొన్ని గజాలు ఇవతలగా చక్కటి 'ఫౌన్టెన్', 'పెడస్టల్' మీద ప్రణయ లీలలో మునిగివున్న రాధా మాధవులమీద నిర్విరామంగా పన్నీటి జల్లులు కురిపిస్తోంది.

ఆ జల్లులలో తడుస్తూ కేరింతాలు కొడుతూ ఆడుతున్నారు పిల్లలు.

తెలియకుండానే అడుగులవడి తగ్గింది విశాలకు. మనసు కాస్సేపు చంచలంగా గెంతులేసింది. తాను గూడా ఆ తుంపర్లలో తడవాలనీ, ఆ పిల్లలతో కలిసి పోవాలనే చిలిపి కోర్కెను బలవంతాన అణుచుకున్నది.

పెళ్లి అయిన తొలిరోజుల్లో తనూ జయరామ్, వెన్నెల రాత్రులు ఆ 'ఫౌన్టెన్' గట్టుమీద కూర్చుని ఎన్నో వూసులు, మరెన్నో బాసలు చేసుకుంటూ గంటల్ని క్షణాలుగా దొర్లించడం తలపుకొచ్చి ఒళ్లు పులకరించింది. ఆపుకోలేని మంద హాసం బుగ్గల్లోకి గులాబిరంగు పుప్పించింది. అన్నగారు చూడకుండా మొహమటు తిప్పుకుని తనలో తనే మురిసి పోయింది విశాల.

'ఫౌన్టెన్'కు ఒక వైపున చీలిన సన్నని కాలిబాట చివరనవున్నది 'ఔట్ హౌస్', బాట కిరువైపులా వాలుగా పాతిన

ఇటకరాళ్లమీద కొత్తగావేసిన మన్నం తెల్లగా మెరుస్తూంది. వాటివెనక ఒత్తుగా పెరిగిన 'లైన్ తోటకూర' మొక్కలు రాళ్లను కప్పెయ్యాలని చూస్తున్నాయి. కాలిబాట మధ్యన మెత్తని, తెల్లని ఇసుక పాదాల్ని మృదువుగా ముద్దెట్టుకుంటూంది.

'ఔట్‌హౌస్' చుట్టూతా కొంత స్థలం వదిలి ముళ్లతీగలతో అడ్డం కట్టారు. వీధి గుమ్మాని కెదురుగా చుట్టూతా చట్రమున్న తీగల గేటుగూడా అమర్చారు.

అడివిలాంటి ఆ పెద్దతోటలో మూలగా ఆ చిన్నఇల్లు చుట్టూతా పూల మొక్కలతో వంటరిగా, అందంగా, ఒకముని వాటికలా వుంటుంది.

రఘు కుడిచేతిలోని సూట్‌కేసు ఎడమ చేతిలోకి మార్చుకుని గేటుకున్న తాడు వూడదీసి వెనక్కు తోశాడు.

గేటు చప్పుడుకు వరండాలోకి రాబోయిన తండ్రి ఒకకాలు మళ్లీ ఇంట్లోకి వేసి. 'ఇదిగో ఏమేవ్ అమ్మామొచ్చింది' అన్నాడు పెద్దగా. సంతోషంతో ఆయన మొహం విప్పారింది.

చేతిలో పని ఆపుచేసి ఆదరాబదరా బయట కొచ్చేసింది తల్లి. కూతురికి ఎదురువెళ్లి రెండు చేతులూ జాపి, 'నాతల్లి— నాతల్లి' అంటూ అక్కున జేర్చుకున్నది.

అప్పటికి గేటు మళ్లీ బిగించి సూట్‌కేసుతో వరండాలో కొచ్చాడు రఘు.

'లోపలికి వదండే ఇక్కడేనా?' అన్నాడు చనువుతో కూడిన విసుగుతో ముందలిస్తూ.

అయినా మధురమైన ఆ మమతా బంధంనుంచి జారిపోవాలని విశాలకుగాని, ఆ మమకారపు అనుభూతిని సడలించాలని తల్లికిగాని అనిపించక పోవడాన ఒకరి నొకరు అలా పొదువుకుంటూనే ఇంట్లోకి నడిచారు.

'అమ్మా! చేతుల్నిండా అపిండితో అలా వాటేసుకున్నా వేమిటే దాన్ని? చూడు, దాని జాకెట్టునిండా అపిండి!' రెండోసారి విసుక్కున్నాడు రఘు.

అప్పటికి ఆ లోకంలోకి వచ్చింది తల్లి.

'బిడ్డను చూసేసరికి ఒళ్లు తెలియ లేదురా. అయ్యయ్యో జాకెట్టంతా పాడయ్యింది కదా!' నొచ్చుకున్నది తల్లి చేతులు చూచుకుంటూ.

'ఫరవాలేదు లేవే అమ్మా! ఇప్పుడెలానూ స్నానంచేసి బట్టలు మారుస్తానుగా.' సర్దేసింది విశాల.

ఇదే విశాల రెండేళ్ల కిందట వోణికి చిన్నమరకో, జాకెట్టు కాస్త వదులో అయితే, ఎంత హంగామా చేసేదో గుర్తు కొచ్చి నవ్వుకున్నాడు తండ్రి.

గదిలోనించి వదిన సరోజ రెండేళ్ల బుజ్జిగాణ్ణి ఎత్తుకొని చావిట్లోకి వచ్చింది.

'ఏం విశాలా కులాసాయేనా?' అని నవ్వుతూ పలకరించింది.

'ఆ' అంటూ బుజ్జిని చేతుల్లోకి తీసుకోబోయింది విశాల. వాడు ససేమిరా తల్లి చంక వదలక ఏడుపు లంకించుకోడంతో వొదిలేసింది. సరోజ వాణ్ణి బుజ్జగిస్తూ గదిలోకి తీసికెళ్లి పోయింది.

తల్లినలా వంటింట్లోకి, అన్ననిలా గదిలోకీ. వెళ్లనిచ్చి తండ్రి దగ్గరికి చేరింది విశాల. మంచం పట్టీ పానుకుని కూచుని, తండ్రి ఒడిలో చేతులు వేసి,

'నీ ఒంట్లో ఎలా వుంటోంది నాన్నా?' అన్నది ఆప్యాయంగా.

అప్పటిదాకా తల్లీ కూతుళ్ల మమకారపు వెల్లువను చూస్తూనే ఆనందిస్తున్న తండ్రి, ఇప్పుడిహ తన వంతు వచ్చినట్టుయి కూతురి తలపై చెయ్యి వేశాడు ఆపేక్షగా. రెండేళ్ల కిందట ఇప్పట్లాగే, గోముగా, 'నన్ను సినిమాకి తీసికెళ్లవా నాన్నా' అని గారాబం కుడిచిన విశాలకీ, రెండేళ్లు కాపురం చేసి వచ్చి ఒళ్లో చేతులేసిన విశాలకీ తేడా కన్పించలేదాయనకి.

'నాకేం తల్లీ బాగానే వున్నా' అంటూ తల నిమిరాడు.

'ఏం బాగో చిక్కిపోయావు. 'షుగరు' ఎక్కువైందటగా! గుండె నెప్పి గూడా వస్తోందని అన్నయ్య చెప్పాడు.' విశాల గొంతులో దిగులు తొంగి చూచింది.

'నా మాటకేం మొచ్చెలే గాని నీ అత్తవారింట నీకు సౌకర్యంగా వుంటున్నదా తల్లీ! మీ ఆయన నిన్ను బాగా చూసుకుంటున్నాడా అమ్మా' అని అడిగాడు ఆత్రంగా.

నిజానికి ఆ రెండు ప్రశ్నలూ కాపురానికి మొదటిసారిగా వెళ్లి వచ్చిన కూతుర్ని సహజంగా అయిన వాళ్లు అడిగేవే, కాని నిజానికి ఇప్పుడవి అనవసరమైనవే. ఎందువల్లనంటే—

అత్తవారి ఆదరణకు నిదర్శనంగా ఇక్కడుండగా సన్నగా రివటలా వుండే విశాల పుష్టిగా తయారయింది. శరీరం గూడా రంగు పెంచుకుని కాంతులీనుతున్నది.

తరచూ విశాల రాసిన వుత్తరాలూ, విశాల మొహంలోని సంతృప్తీ ఆమెకు భర్త ప్రేమకు కొరతలేదని నిరూపిస్తూనే వున్నాయి.

అయినా ఆయన ఆరాటం ఆయనది.

జవాబు చెప్పక సిగ్గుగా తలవంచుకున్నది విశాల. అదే సమాధానంగా తీసుకుని సంతృప్తిగా నవ్వుకున్నాడు తండ్రి.

కడుక్కున్న చేతులు కొంగుకు తుడుచుకుంటూ తల్లి, స్నానం చేసి బట్టలు మార్చుకుని అన్నగారూ, వచ్చే వేళకు అదే తీరున తండ్రికి ఏవేవో కబుర్లు మెల్లిగా చెబుతోంది విశాల.

నిజమే. తల్లి దగ్గర కంటే తండ్రి దగ్గరే చనువు ఎక్కువ విశాలకు.

తల్లి ఏదో అడగబోతూంటే వారిస్తూ, 'దాన్ని స్నానమన్నా చెయ్యనివ్వండే!' అని వాళ్లనూ, 'ఇందాకల్లా చిరాకంటూ మొత్తుకున్నదానివి ఎంతకీ లేవవేమే?' అంటూ చెల్లెలినీ కసురుకున్నాడు రఘు.

'అమ్మా నా పెట్టెలో వో పింక్ జాకెట్టూ తెచ్చిపెట్టవే' అంటూ తల్లికి పురమాయించి తువ్వాలు భుజంమీద వేసుకుంటూ విశాల పెరట్లోకి నడిచింది.

తండ్రి మంచం ఎదరగా పడక కుర్చీలో విశ్రాంతిగా వాలబోతూ, 'దీనికింకా చిన్నతనం ఒదలలేదే అమ్మా' అన్నాడు రఘు.

బట్టలు తీసుకుని వెళ్లబోతున్న తల్లి ఆగిపోయింది తెల్లబోతూ; వులిక్కిపడ్డాడు తండ్రి.

'ఏమయిందిరా?' ఆత్రంగా వెనక్కి వచ్చింది తల్లి, మంచంమీద నిటారుగా కూర్చున్నాడు తండ్రి.

'అబ్బే మరేం లేదులే.' సావకాశంగా అన్నాడు రఘు.

'మరేవిటిరా?' తండ్రి విసుక్కున్నాడు. చెప్పేది ఆపేసి ఈ నాన్చుడేవిటి అని.

'అహ — పదిరోజుల్లో నూర్పిళ్ళయి పోతాయీ, అప్పుడు పంపుతాములే బావనీ అని వాళ్ళంటారు. అదే బావా అన్నాడు. అహ అల్లాకాదు ఇప్పుడు, ఏకాఏకీ నా వెంటే రావాలీ అని మంకుపట్టుపట్టింది ఇది.'

'అంతే కద' వెనక్కువాలాడు తండ్రి.

తేలిగ్గా నిట్టూర్చింది తల్లి.

'ఆరికాదే వాళ్ళ పీలూ సోలూ ఇది మాత్రం గమనించవద్దూ? తను ఇప్పు డొచ్చేస్తే పెద్దాయన్ని ఆయాస పెట్టాలి సొస్తుందీ అ ప టా ని బావ అన్నాడని ఆమనిమీద 'కోల్డ్ వార్' ప్రకటించి నాతో వచ్చేసింది ఇది' న వ్వు గా అన్నాడు రఘు. అతనితోపాటు తండ్రీ నవ్వేశాడు. తల్లిమాత్రం,

'ఎప్పుడొస్తుందో ఏ వి టో దీనికి ఏసరం? ఇక్కడైతే ఎంత దాక్షిణ్యం చేసినా మన పిల్లకాబట్టి కడుపులో పెట్టుకున్నాం. వాళ్ళమీదకూడా అది కారం చెలాయిస్తే బాగుంటుందా?' అన్నది విచారంగా.

"పాపం. వాళ్ళుకూడా చాలా మంచి వాళ్ళేనే అమ్మా. ఇది పైపైన తిరుగుతూ కబుర్లు చెబుతూ తలాయిస్తున్నా పిలిచి ఒక్కపని చెప్పదు అత్తగారు. చూశానుగ! 'అమ్మా, విశాలా' అని ఎంత లబ్జుగా పిలుస్తుం దనుకున్నావ్! ఆడపిల్లల్లేని ఇల్లు విశాల వచ్చాక కల కల్లాడుతోందని ఆవిడ ఎంత ముచ్చట పడిపోతోందో...ఇది ఆవిడ్నే అంత దుల పరించుకు తిరుగుతుంది. ఇక ఆ మామ గారో... దీని అలక ఎక్కడ కనిపెట్టాడో ... 'ముష్వేళ్ళరా పాపం. ఆ అమ్మాయిని చిన్న బుచ్చకు. ఈ సారికి నేనెలాగో అవస్థ పడతాన్లే' అని బావని బయలు దేరదియ్యాలని చూశాడు. 'మీ కిన్నాళ్ళూ ఎలాగూ తప్పలేదు — నేనొచ్చాకా గూనా?' అని బావే మెత్తబడలేదు. ఇక దీనికోపం మాడాలనుకో. అప్పట్నించి బావతో ఒక్క మాట మాట్లాడలేదు. 'పండక్కి రెండు రోజులు ముందుగా తప్పక రా బావా' అని నేనే మాటతీసుకుని వచ్చేశాము.' జరిగిన సమాచారమంతా వివరంగా చెప్పాడు రఘు.

'బానే వున్నది' నొచ్చుకున్నది తల్లి.

బట్టలకోసం స్నానం చేస్తున్న విశాల కేక వెయ్యటంతో తల్లి అక్కడ్నించి వెళ్ళిపోయింది.

ఎవరి ఆలోచనల్లో వారు జారుకుని, నిశ్శబ్దంలో పడ్డారు తండ్రీ కొడుకూ.

* * *

రఘు తరవాత ఎడంగా పుట్టిన ఆడ పిల్ల కావటాన అల్లారుముద్దుగా, అతి గారాబంగా, ఆడింది ఆటగా — పాడింది పాటగా పెరిగింది విశాల.

విశాల యస్.యస్.యల్.సి. ప్యాసయింది —తండ్రి ఆరోగ్యం చూడబోతే బాగుండ లేదు. ఎప్పటికైనా ఆడపిల్లని ఒక అయ్య చేతిలో పెట్టవలసిందే గదా. తన ఘట ముండగానే ఆ మూడు ముళ్ళూ పడితే మంచిదని అనుకూలమైన సంబంధము చూచి విశాలకి చిన్నతనంలోనే పెళ్ళి చేశారు.

ఎగ్రికల్చర్ బి. యస్. సి. మొదటి సంవత్సరం చదువుతున్న ఆనందరావు మొదట్లో చదువు పూర్తికానిదే పెళ్ళేమి టన్నవాడల్లా విశాలను చూశాక తన నిర్ణయం మార్చుకోవటమే కాకుండా, మిగతా రెండు సంవత్సరాల చదువూ విశాలతో కాపురంపెట్టే పూర్తిచేశాడు. చదువు ముగిశాక, వేరే ఉద్యోగా నేమీ చూసుకోకుండా, తానొక్కడూ ఈదలేకుండా వున్న వ్యవసాయంలో ఆసరాగా వుండమన్న తండ్రి కోరిక ప్రకారం పల్లెకు వచ్చేశాడు ఆనందరావు.

కాని పసితనం వదలని విశాలకు పెద్ద వాళ్ళ పొందున ఒద్దికగా మసలడం ఇబ్బందిగా పరిణమించింది. కారణం— భర్తతో ఒంటరిగా సాగించిన కొత్త సంసారం విశాలకు పంచరంగుల కలలా మిగిలిపోయిందే తప్ప బరువూ—బాధ్యతా, కష్టమూ—సుఖమూ తెలుసుకునే అవ సరమూ, అవకాశమూ కలగలేదు.

అందుకనే రెండేళ్ళ తల్లీ తండ్రి ఎన్నిసార్లు కబుర్లు పెట్టినా భర్తను వదిలిపెట్టి రావడానికి ఇష్టపడక, కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటూ వస్తున్న విశాల ఈసారి అడగంగానే అన్నగారివెంట బయలుదేరుతూ పంజరంనించి విముక్తమైన పక్షిలా 'ఫీ'లయ్యింది.

* * *

'కౌసల్యా సుప్రజారామ...' మెల్లిగా చదువుకుంటూ దేవుడి గదిలో దీపం వెలిగించుకుంటున్న తల్లి, చిరపరిచిత మయిన మెత్తని పాదాల సవ్వడి విని తల పైకెత్తింది...విశాల! అర్ధనిమీలిత నేత్రాలతో చేతులు జోడించి నిలబడి వుంది. మరుక్షణం కళ్ళు తెరిచి మంగళ స్తోత్రాలు కళ్ళ కద్దుకుని వెనక్కి

మీరుంటే లిఫ్టు పైకి పోవడం లేదు - కాస్త శ్రమ అనుకోకుండా మెట్లమీదుగా రాకూడదూ?



తిరిగింది.

'అప్పుడే లేచా వెందుకమ్మా ఇంకా పూర్తిగా తెల్లవారనేలేదు. పో పోయి పడుకో.' అన్నది తల్లి. నిద్రమత్తు పూర్తిగా వదలని కూతుర్ని ఆప్యాయంగా చూస్తూ.

'ఊహూ—మెలకువ వొచ్చేసిందే!' పెరట్లోకి నడుస్తూ అన్నది విశాల.

పెరట్లో నూతి గట్టుని ఆనుకుని నిలబడింది విశాల బద్ధకంగా. పొగమంచు తెరసెల్లా నెరకనించి సుందరంగా తొంగిచూస్తున్న చామంతిమడినీ వన్నజాజి పందిర్నీ పరవశంగా చూసింది విశాల. విడీవిడని పువ్వుల సౌరభాలు కలగాపులగంగా మనసుని మత్తెక్కిస్తున్నాయి. దూరంగా ఒక పక్కగా రాజాగారి మేడ ఇంకా వెలుగుతున్న మెర్క్యురీ లైట్ల వెలుతుర్లో జిగేల్‌మంటూ ఠీవిగా, హుందాగా మిడిసిపడుతోంది.

నెమ్మదిగా కాలకృత్యాలు ముగించుకున్నది. తల్లి పూజ యింకా అవనట్లుంది దేవుడి గదిలోంచి ఇంకా శ్లోకాలు వినిపిస్తూనే వున్నాయి.

తిరిగి గదిలోకి వెళ్ళబోతూ ఆగింది. రోటి పక్కగా కడిగిన పప్పు కనిపించింది. తండ్రికి ప్రొద్దుటే మినప కుడుము తినటం అలవాటు. కొంగు దోపుకుని రోటి ముందు పీట వాల్చుకున్నది.

రోటి చప్పుడు విని తొంగి చూచింది తల్లి.

'నీకెందులే తల్లీ ఆ మోటుపని—నే వస్తున్నానుగా' అన్నది. కూతురు కష్టపడిపోతుందన్న ఆరాటం కొద్దీ.

'ఫరవాలా! నా కలవాటే' అన్నది విశాల రుబ్బటం ఆపకుండానే.

పూజ మధ్యలో ఆపి రాలేక పూరుకున్నదావిడ. కాని ధ్యానమిక దేవుడి మీద నిలపలేక పోయింది. ఎలాగో తొందరగా ముగించి హారతి ఇచ్చింది. తులసి కోటలో నీళ్ళు వడ్డించి, 'ఆదిత్య హృదయం' పఠిస్తూనే వచ్చి రోటి దగ్గర కూలబడింది 'ఇక లేమ్మా లే' అంటూ.

ఆ పాటికి విశాల రుబ్బటం పూర్తి చేసి పిండి గిన్నెలోకి ఎత్తి పెడుతోంది,

విశాల మనసు

మెత్తగా బూరును ఆరవి పిండిని చూస్తూ

'ఎప్పుడు నేర్చుకున్నావే ఇంత పని నేర్పు?' కూతురు పనిమంతురాలయిందని సంబర పడ్డది తల్లి. ఇక్కడుండగా అక్కడి చెంబుతీసి ఇక్కడ పెట్టేదికాదు విశాల.

'మా ఇంట్లోనూ రోజూ ప్రొద్దుటే టిఫిను వుండాలి సిందేగా. ఝాము పొద్దెక్కేదాకా గొడ్లచావిట్లోంచి వూడి పడదు మా అత్తగారు. ఆ దిక్కుమాలిన పల్లెటూళ్లో హోటళ్ళు కూడా లేవాయె. మరి తప్పుతుందా నేర్చుకోవటం?' అత్తగారిదే నేరమన్నట్లు నిష్టూరంగా మాట్లాడింది విశాల.

'గొడ్ల దగ్గరకు ఆవిడెందుకూ? పాలేర్లు లేరూ?'

'అబ్బో వాళ్ళు చేసేపని ఈవిడకు నచ్చద్దూ! దగ్గరుండి వూడ్చినదే వూడ్పించి, కడిగిందే కడిగిస్తేగాని తృప్తి పడదు. ఆ ఆవూ, గేదెలకి బాగా అలవాటు చేసిందేమో ఆవిడకు తప్ప మరెవ్వరికీ పాలివ్వవాయె! ఇవన్నీ అయి ఆవిడ వంటింట్లోకి జొరబడే సరికి పొద్దు కరకరలాడుతుంది. ఆ పాటికి నేను పిండి రుబ్బి అక్కడ పెడితే తనప్పుడొచ్చి పొయ్యి ఎక్కిస్తుంది.' విశాల గొంతులో అత్తగారికి సహకరిస్తున్నాననే తృప్తికంటే, అంతవరదాకా ఇంటి పని తన నెత్తిన రుద్ది వూరుకున్నదన్న దుగ్ధే ఎక్కువగా వినిపించింది తల్లికి.

ఆ మాత్రం సాయం చేస్తే తప్పేమిటని తల్లికి అనిపించినా, కూతురి వుద్దేశ్యం అలా లేదని తెలుస్తూనే వుండయ్యె. అందువల్ల మౌనంగా వూరుకున్నది.

జీలకర్రా, మిరియప్పొడీ చల్లి, కమ్మని నెయ్యి ఒత్తుగా రాసిన కుడుము ఒక ప్లేటులోనూ, పొగలు కక్కుతున్న ఇడ్లీలూ, కారప్పొడీ మరో ప్లేటులోనూ సద్ది చావిట్లో పేపరు చూసుకుంటున్న తండ్రికీ, ఆఫీసు కాగితాలు వ్రాసుకుంటున్న అన్నయ్యకీ ఇచ్చి వచ్చింది విశాల. ఇంతలో తల్లి కాఫీ కలిపితే ఎవరిగ్లాసు వారికందించి వచ్చి తానూ

తో గ్లాసు అందుకుని పీట వాల్చుకుని కూర్చుంటూ కూరలబుట్ట ముందుకు లాక్కుంది.

కలిసిపోయిన కూరగాయల్ని విడదీసి వేటికవి ఏరి పెడుతూ మధ్య మధ్య కాఫీని రుచిచూస్తూ, వదిన ఇంకా లేవనే లేదేం అమ్మా?' అని అడిగింది కొంచెం వింతగా మొహం పెట్టి.

తల్లి సమాధానంగా ఏదో చెప్పబోయి ఆగింది. క్షణంసేపు వస్తోయించి 'లేస్తుందిలే మెల్లిగా, తొందరేం?' అన్నది ముక్తసరిగా.

'అదేమిటి? వాళ్ళే పొద్దుల్లో వున్న నువ్వేనా మరి తూరుపు తెల్లవారకుండా లేచి చాకిరీ చెయ్యాలిసింది?' బలహీనంగా వున్న తల్లి చెంపలకేసి చూస్తూ అసహనంగా కదిలింది విశాల.

'ఆ విచక్షణా జ్ఞానం కూతుళ్ళకుంటుందేమోగాని కోడళ్ళ కెందుకుంటుందమ్మా' అన్నది తల్లి నిట్టూరుస్తూ.

వదినగారు పాను పెక్కి రాజభోగాలు పోతున్నదన్నమాట! తన తల్లేమో వాళ్ళ దాచుకోదు. బాగుంది వరస, అనుకుని, మరి ఆమాటలు తర్కించకుండా కూరలు తరగడంలో మునిగిపోయింది.

ఆ రోజంతా సరోజ గదివదిలి బయటకు రానేలేదు, అరుదుగా ఏకాఫీ తాగేందుకో, బుజ్జికి పాలు కలిపేందుకో, వచ్చినా ఇట్టేవచ్చి అట్టే గదిలోకి మళ్ళీ వెంచేస్తూ వుండటం విశాల గమనిస్తూనే వున్నది.

తల్లి అవసోపాలు పడుతో అటు తండ్రికి పథ్యపానాలు సమకూరుస్తూ ఇటు అన్నకు ఆఫీసు టయిముకల్లా వంటావార్పూ అమర్చడానికీ సతమతమవుతూకూడా కోడల్ని చెయ్యిసాయానికి పిలవకపోగా, మధ్య మధ్య గదిలోకి తొంగి చూసి 'ఒక్కముద్ద నోటబెట్టుకుని పడుకోవే' అంటూ బ్రతిమలాడ్డం, ఆవిడగారేమో పడుకున్నది కదలకుండానే మెల్లిగా ఏదో గారాలు కుడుస్తో సమాధాన మిస్తుండటం, ఈ సరణి విశాలకేమీ నచ్చలేదు.

తల్లికి చాతనయినట్టు సాయం చేస్తూనే ఎన్నోసార్లు వదిన గారి ప్రవర్తన మీద ఏదో 'వ్యాఖ్య' విసరాలనుకోవటం,

కిన వెంటనే ఎందుకో కటువటాయించి తమాయించుకోవటం పాపం విశాల మన స్థితి క్రిందుమీదు లవుతూనే వున్నది నిముష నిముషమూ.

* * *

మరునాడు విశాల లేచేసరికి వంటింట్లోంచి సరోజ గొంతు వినిపిస్తోంది. 'వదినకీవేళ అప్పుడే తెల్లవారిందే ?' అనుకున్నది విశాల. అం కన్న విచిత్రం! 'నిన్నంతా సోమరిగా పడుకున్న మనిషి ఈ వదేనా?' అనిపించేట్టుగా చకచకా ఎవర్నీ వేలుపెట్టనివ్వకుండా చేసుకుపోతూంది సరోజ.

'మీరుండండి అత్తయ్యా! నిన్ననంతా చేసిచేసి నలిగిపోయారు. ఈ వేళన్నా కాస్త విశ్రాంతిగా కూర్చోండి' అంటూ ఎప్పటికప్పుడు వంటింట్లోంచి తరిమేస్తోంది అత్తగార్ని.

కాఫీ గ్లాసులు కడగబోతున్న విశాల చేతుల్లో గ్లాసులు లాక్కుని తనే కడుగుతూ, 'నువ్వు చెయ్యాలిసింది ఇక్కడ కాదు లేవమ్మా విశాలా! మీ అత్తారింట్లో చెయ్యి' అంటూ నవ్వింది.

తెల్లబోయింది విశాల. వదినగారు తన మనసులోకి తొంగిచూడలేదు కదా!

మాట తప్పించి, 'నిన్ననలా పడుకేశావేం వదినా?' అన్నది.

'మరే! ఈ మధ్య ఒంట్లో అప్పుడప్పుడూ నలతగా వుంటోందిలే' చిరునవ్వుని పెదవుల మధ్య బిగించి మొహం త్రిప్పుకుంది.

బుజ్జిగాడికి నీళ్ళుపోసి ఒంటికి పౌడరద్దుతోంది తల్లి.

'ఏమిటో ఏమిట్లే. బుజ్జికి చెల్లాయో, తమ్ముడో పుట్టబోతున్నారు. ఏరా బుజ్జీ! నీకు తమ్ముడు కావాలా? చెల్లెలు కావాలా?' అంటూ వత్తుగా పౌడరు రాసిన వాడి ఎర్రటి బుగ్గల్ని గట్టిగా ముద్దెట్టుకుంది తల్లి. గిలిగింతలు పెట్టినట్టు గలగలా నవ్వాడు బుజ్జి.

'అదా సంగతి' ఆశ్చర్యపోయింది విశాల. వదినని తానెంత అపార్థం చేసుకున్నదీ!

ముందు వరండాలో తల్లి బియ్యం ఏరుతుంటే చేటలో బియ్యాన్ని వేళ్ళతో కదుపుతూ ఆమాటే అన్నది.

'వదిన రోజూ ఇంతే కాబోలు నను కున్నానే అమ్మా నిన్న!'

'లేదమ్మా లేదు. ఒంట్లో బాగుంటే ఒక్కక్షణం ఖాళీగా కూర్చోదు. సరోజ కాపురానికి వచ్చిన కొత్తల్లో నువ్వూ వున్నావుగా! అప్పుడు చెయ్యటమే నేను. ఇప్పుడు నన్నొక పని ముట్టుకోనివ్వదు.'

'దొడ్డబుద్ధమ్మా దానిది! అహర్నిశలూ మా కోసమే తాపత్రయపడి మమ్మల్నింత వాళ్ళని చేశారు మీరు, మీ రుణం తీర్చుకోవాలి అత్తయ్యా! పెద్దతనంలో మీకింత మాత్రం చెయ్యనివ్వండి' అంటుంది.

'ఇంకో ఇంటినించి వచ్చిన పిల్లవు. నువ్వు నాకు రుణపడ్డదేమిటే?' అంటే 'పెంచినవాళ్ళకి సేవచేసే అదృష్టం ఆడపిల్లలకి లేదత్తయ్యా! మీకు నేను చేస్తే మా అమ్మకు మా వదిన చేస్తుందన్న నమ్మకమైనా వుంటుంది అంటుంది.'

అంతగా చదువుకోనిదైనా వదిన ఎంత ఉత్తమురాలు!

మరి కోడల్ని ఇంతగా మెచ్చుకుంటున్న అమ్మ నిన్న నలా ఎందుకు బయటపడ్డట్టు?

నిన్న కోడళ్ళమీద విసిరిన విసురు ఎవరిని వుద్దేశించి విసిరినట్టు? ఎవరిని! ఎవరి నన్నట్టు?

తనలో వుత్పన్నమవుతున్న ప్రశ్నలకు జవాబుకోసం తల్లిమొహం కేసి పరకాయించి చూచింది.

పరగా తననే పరీక్షించి చూస్తున్న తల్లి కంటి కొనలలో మందహాసపులాంటి మెరుపేదో కొంటెగా మిలమిల లాడింది.

విశాలకు తనతప్పు తానే తెలుసుకోగలగాలనే తల్లి వుద్దేశ్యం అవగాహన అయింది. సిగ్గుపడింది, కృతజ్ఞతగా చూచింది.

'చిత్రం! పుట్టింటికి రాగానే పనిలో తనకీ వోర్పూ, నేర్పూ ఎలా అబ్బాయి చెప్మా! అమ్మమాటల్లో ఎంత వాస్తవం ఇమిడివుందీ!'

తనని తాను తరచి చూచుకున్నది విశాల.

తన అత్తగారికి లోబ్లడ్ ప్రెషర్. తెల్లవారు జాము నాలుగ్గంటలకు లేచి రాత్రి పదింటిదాకా నడ్డి వాల్చేందుకు తీరదావిడకు. ఆవిడ్ని తల్చుకుని ఎప్పుడైనా 'పాపం' అనన్నా అనుకున్నదా తాను?

ఇప్పుడు తల్లి హైరానా చూస్తున్న కొద్దీ ఆమెమీద జాలితోపాటు వదినగారిపైన కోపమూ పురవరలాడిందే!

తనలో దోషముంచుకుని వదినగారినెలా ఎంచాలనుకున్నదీ తను? గురివింద పూస సామ్యంగా వుంది వరస!

విశాల లేతమనసు పశ్చాత్తాపంతో పునీతమయింది.

* * *

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక తండ్రీ కూతురూ పిచ్చాపాటీలో పడ్డారు.



ఆవేళ ఆదివారం అవటం మూలాన రఘు కూడా వారి సంభాషణలో పాలుపంచుకున్నాడు. తల్లి సరేసరి. పైపై పనులు, చూసుకుంటూ చాలావరకూ ఖాళీగానే వుంటుందావిడ.

ముందు విశాల కిష్టమైన సినిమాలూ, వాటిల్లో పాటలూ, షాపింగులమీద మొదలైన ముచ్చట్లు — మెల్లిగా పల్లెటూళ్ల సొంపూ సౌందర్యమూ మీదికి నడిచింది.

వున్నట్టుండి తండ్రి అడిగాడు. 'ఏమ్మా మీ ఆయన వ్యవసాయంలో స్థిరపడ్డట్టేనా?' అని.

విశాల మొహం హఠాత్తుగా ముడుచుకు పోయింది.

'అలాగే అంటున్నారు' అన్నది ముభావంగా తనకు పట్టనట్టు.

'ఇంత చదువూ చదివి ఆ పొలంలో వ్యవసాయంలో దిగటమేమిటండీ? దర్జాగా ఏ ఉద్యోగమో చూసుకోక?' అన్నది తల్లి ఆశ్చర్యంగా, వీపుమీద వుయ్యాల లూగుతున్న మనవణ్ని ముందుకు లాక్కుంటూ.

తల్లివంక మెచ్చుకోలుగా చూసింది విశాల.

'అలా గనకమ్మా ఈ రోజుల్లో ఎన్ని డిగ్రీలు సంపాదించుకున్నా వుద్యోగాలు అంత తేలిగ్గా దొరకటంలేదు. ఇంతా చేసి విదుగూ బొదుగూ లేని ఆ వుద్యోగాల్లో బాముకునేదేముంది గనక! ముప్పై మూడు వందల జీతపురాళ్లే కద. అంతకన్న ఎక్కువగానే ఈ వ్యవసాయంలో రాజాగా

విశాల మనసు

సంపాదించుకోవచ్చు.' అన్నాడు రఘు.

'నాకు తెలీకడుగుతానూ! అలాగనుకునేటప్పుడు మరి అంత డబ్బుపోసి అన్నేళ్ల చదువు చదవకపోతేనేమిరా? ముందే తండ్రికి చేదోడు వాదోడుగా వుంటే ఈపాటికా వ్యవసాయప్పనుల లోతుపాతులన్నీ తెలిసివుండేవికా?' అమాయకంగా అనుమానాన్ని వెల్లడించింది తల్లి.

'నీ మొహం! నీకు తెలియదులే. అల్లుడు చదివింది పొలం పనులకు సంబంధించినదే. అతని విద్య వృధా కాదులే' నవ్వుతూ తండ్రి తెలియ చెప్పాడు.

'బావ కూడా అదే అన్నాడు. తండ్రి కాలంనాటి పాత పద్ధతులకి స్వస్తి చెప్పి, ఈ ఏడు బావ వేయించిన కొత్త మార్పులవల్ల దిగుబడి బాగా అయిందట.'

'నిజమేలే! చదువుకున్న ప్రతివాళ్లూ వుద్యోగాలకి ఎగబడబట్టే ఇప్పుడింత నిరుద్యోగం ప్రబలిపోయింది. కనీసం కొంతమందయినా ఇలా వుద్యోగమే చదువుకు లక్ష్యమనుకోక పల్లెలకు మళ్లగలిగితే తిండి కరువు తీరుతుంది. అల్లుడు మంచి పనే చేశాడు. అటు చదువూ సార్థకమవుతుంది. ఇటు రాబడీ పెరుగుతుంది' సంతృప్తిగా తల పంకించాడు తండ్రి.

అందరూ తనకు వ్యతిరేకమే; నిట్టూర్చింది విశాల.

'రాబడిమాట నిజమేనేమోగాని ఆ పల్లెటూళ్లో నా పరదానా, పాడా? ఎంత సంపాదిస్తే నేం, అనుభవించే వీలు లేక పోయాక.' విశాల తన అయిష్టానికి మూల కారణం బయట పెట్టింది.

'పిచ్చి పిల్లా! అలాగేం? చేతినిండా కాసులు లేకపోతే సరదాల మధ్యలో కాపురం పెట్టినా ప్రయోజనమేమిటే? అనుభవించాలనే మనస్తత్వమే వుండాలి గానీ పల్లెటూరనేమిటే? పట్నవాసమనేమిటే! ఎక్కడున్నా ఒకటే! హాయిగా పొలంలో పాడి పంట లారగిస్తూ వుండలేక, సిటీల్లో ఇరుకు కొంపల్లో వుంటూ, మురికి గాలి పీలుస్తూ బతకడంలో సుఖమేమిటే? ఏ సినిమాలో కావాలనుకున్నప్పుడు జామ్మని ఏ నాలుగు రోజులు టౌన్‌లో మకాంవేసి కులాసాగా తిరిగితే పోలా.' తేల్చేశాడు రఘు.

ఆలోచనలో పడింది విశాల. ఆమె మనసులో మామగారు సారి ధాన్యమమ్మాక కాశ్మీరు యాత్రకు వెళ్లమన్న విషయం మెదిలి మెత్తబడుతోంది.

* * *

రాజాగారి తోటమాలి రకరకాల పూలు సజ్జనిండా ఇచ్చిపోయాడు.

వదినగారు అన్నీ కలేసి అందంగా మాల కడుతూంటే పువ్వులందిస్తూ ఎదురుగా కూర్చుంది విశాల.

పువ్వుల రంగులు కొట్టొచ్చినట్టు కనబడ్డాయేమో బుజ్జిగాడు గిలక్కాయ లొదిలేసి పువ్వుల మీద ఎగబడ్డాడు చేతులతో నలిపేస్తూ. వాడి వుడుంపట్టు వదిలించలేక విసుగ్గా ఒక్కటి వడ్డించింది సరోజ.

తారాపథాన్నంటిన వాడి రాగం వంటింటి నడవలో ఒత్తులు చేసుకుంటు నాయనమ్మగారికి గజేంద్రుని మొరలా వినిపించి లబలబ లాడుతూ పరిగెత్తుకొచ్చింది.

'వాణ్ణెందుకే అలా బాదుకున్నావ్?' అబ్బే ఈకాలప్పిల్లలకి కొంచెమన్నా ఓర్పు లేదమ్మా!' అంటూ విసుక్కుని మనవణ్ణెత్తుకుపోయింది ఓదారుస్తూ.

నవ్వుకున్నారు వదినా మరదళ్లిద్దరూ.

'నిజమే విశాలా—అత్తయ్య ఓపికకి మెచ్చుకోవాలసిందే. వాడుచేసే అగానికి ఆవిడ గాబట్టి ఓర్చుకుంటున్నారు గాని నేనైతే తట్టుకోలేక పోదును'

నవ్వేసి వూరుకున్నది విశాల.

[illegible] — పెద్దవాళ్లుండటం మం



అదృష్టం విశాలా! వారి అనుభవమూ, గుండె నిబ్బరమూ, ఓరిమీ, సహనమూ, మనకు శ్రీరామరక్ష. వారి అండవ మనం నిశ్చింతగా బతగ్గలం.'

సరోజ కంఠం మెల్లిగా మెత్తగా సాగి పోతూంటే పాఠాలు ఒంట బట్టించు కున్నది విశాల. మనసు ఒదినగారిపట్ల గౌరవభావంతో నిండింది.

అనుకున్నట్లుగానే పండుగకు రెండు రోజులు ముందుగానే వచ్చేశాడు ఆనంద రావు.

'విశా! గుంటూరులో ఎగ్రికల్చరల్ డిమానిస్ట్రేటర్ ఇంటర్వ్యూ వచ్చింది పొలాలన్నీ కౌలు కిచ్చేటట్లు నాన్నని ఒప్పించాను. మా అమ్మా నాన్న పొలంలో ఇల్లు వదిలి మనతోకూడా వచ్చేందుకు ఒప్పుకోడంలేదు ఏం చేస్తాం! అప్పుడప్పుడూ వచ్చి చూస్తూందాం' అని.

విశాల నొసలు చిట్లించింది. 'వద్దు ట్రాక్టరుకొని ఈ ఏడాది పొలాలన్నీ స్వంతంగా చేయిస్తానన్నారుగ! మధ్యలో ఈ వుద్యోగ ప్రయత్నమెందుకూ? అయినా ఆ గుంటూరు ఎండల్లో, నీటి ఎద్దడిలో మనం వుండలేం బాబూ, పొలంలోనే హాయి' నిశ్చయంగా అన్నది విశాల.

'ఆదేం?' ఆశ్చర్యపోయాడు ఆనంద రావు.

'అదంతే లెండి.' నవ్వుతూ అన్నది విశాల.

విశాల ముగ్ధ. వయసు ముమ్మరంలో బాధ్యతలకూ, కట్టుబాట్లకూ చికాకు పడ్డమాట నిజం, వాళ్ళకు దూరంగా ఎగిరి పోవాలనుకున్న మాట నిజమే. కాని అది తప్పుత్రోవని తెలిశాక పంథా మార్చుకోని మూర్ఖత్వం లేదామెలో.

పండుగ నాలుగురోజులూ వుల్లాసంగా గడిచిపోయాయి.

మరి రెండురోజుల తరవాత పొద్దాకు వచ్చగా పసుపు పూసుకుని కొత్తదంచు వెంకటగిరి జరీచీర కట్టుకుని బాధ్యత గుర్తించిన స్త్రీగా, ఇల్లాలిగా విశాల భర్త సరసన పీటగా, హుందాగా ఎరం పోతుంటే కళ్ళల్లో బాష్పాలు నిండుకుని తృప్తిగా చూస్తూ వుండిపోయారు ఆత్త గార్లు, తండ్రి. ●